క్లుప్తంగా

ఏరియా జీఎంకు సన్మానం



శాలేంరాజును సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజును శుక్రవారం ఆయన చాంబర్‌లో భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మద్దెల మాట్లాడుతూ.. బాల్యమిత్రుడైన శాలేంరాజు కష్టపడి కిందిస్థాయి నుంచి జనరల్ మేనేజర్ స్థానానికి చేరుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో ఇంకా ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అందెల ఆనందరావు, కోటిరెడ్డి, కలవల చంద్రశేఖర్‌రావు, ఎండీ రజాక్, మధుకర్, మూర్తి పాల్గొన్నారు.

పక్కా భవనాలు నిర్మించండి

ఇల్లెందు: ఏజెన్సీలో గురుకులాలకు పక్కా భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణం ప్రభుత్వం భవనాలు నిర్మించి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే హరిప్రియ కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఇల్లెందు నియోజకవర్గంలో గురుకులాలకు పక్కా భవనాలు, సీట్ల సంఖ్యను పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు.

రేపు నవోదయ మోడల్ పరీక్ష

కొత్తగూడెంఅర్బన్: ఐదో తరగతి విద్యార్థులకు నవోదయ విద్యాలయ మోడల్ పరీక్ష ఈనెల 6వ తేదిన ఆదివారం ఉచితంగా నిర్వహిస్తున్నామని బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు కె.రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లోని నవత బుక్ స్టాల్, లేదా 9396401400 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రవేశాలు ప్రారంభం

పాల్వంచ: తెలంగాణ మైనార్టీ కొత్తగూడెం గురుకుల బాలికల కళాశాలలో చేరేందుకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ బిపాస శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 16వ తేదీ వరకు పదో తరగతి ఉత్తీర్ణులైన ముస్లిం విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ కొరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9581786989 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉచిత శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: గ్రూప్–3 ఉద్యోగ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న మైనారిటీ అభ్యర్థులకు, మైనారిటీ సంక్షేమశాఖ హైదరాబాద్ వారు జిల్లాలో అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 6వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

బ్యాగులు, పుస్తకాల పంపిణీ



బ్యాగులు అందజేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ నరేష్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీ పరిధిలోని ఉయ్యాలబాడవ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన బ్యాగులు, పుస్తకాలను ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. గిరిజన విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని చేతన ఫౌండేషన్ వారు బ్యాగులు, పుస్తకాలు అందజేయడం సంతోషకరం అన్నారు. సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టి ఆపద కాలంలో మేమున్నామంటూ భరోసానిస్తున్న చేతన ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంతులాల్, చంద్రకాని, నవీన్, షేక్ రషీద్, రూప్లా, అంగన్‌వాడీ టీచర్ సుమతి, కుంజా రాంబాబు, మోహన్ వంశీ, సన్ని, జోగారావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: వర్షాకాలం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా వ్యాధుల వ్యాప్తికి దూరంగా ఉండవచ్చని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పున్నమి చందర్ అన్నారు. శుక్రవారం కేఎస్ఎంలోని కళాశాల ఆవరణలో డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. కళాశాల ఇన్‌చార్జ్ కె.శ్రీనివాస్, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేపీస్పీ రోడ్డులో అంధకారం

- సెంట్రల్ లైటింగ్ ట్రయల్ రన్ వేసి నెల రోజులు
- ప్రారంభానికి కుదరని ముహూర్తం
- అలంకారప్రాయంగా రోడ్డు విస్తరణ
- నిర్లక్ష్యం వీడని అధికారులు



రాత్రివేళ అంధకారంలో కిన్నెరసాని ప్రాజెక్టు రోడ్డు

పాల్వంచ: మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అధికారులు అలసత్వం వీడటం లేదు. రోడ్డు విస్తరణ పనులు సంవత్సరకాలంగా సాగుతున్నా ప్రజలకు మాత్రం ఇంకా ఉపయోగంలోకి రావడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి అల్లూరి సెంటర్ వరకు రూ.5 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు 2022 ఆగస్టులో చేపట్టారు. రోడ్డు పనుల కారణంగా అప్పటి వరకు రోడ్డు పక్కన ఉన్న కరెంట్ పోల్స్‌ను మున్సిపాలిటీ అధికారులు తీసేశారు. దీంతో గత ఫిబ్రవరి నుంచి ఈ రోడ్డు చీకట్లోనే మగ్గుతోంది. అనంతరం రోడ్డు విస్తరణ, డివైడర్, ఎలక్ట్రికల్ టవర్లు ఏర్పాటు పూర్తి చేశారు. తర్వాత సెంట్రల్ లైటింగ్ ఏర్పాటులో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో గత జూన్ 26న 'అంతా అయింది.. లైట్లు ఏవి!?' శీర్షికన సాక్షిలో ప్రత్యేక కథనం ప్రచురితం అయింది. దీంతో అధికారులు స్పందించారు. కాంట్రాక్టర్ యుద్ధ ప్రాతిపదికన సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టి జూలై 8 నాటికి పూర్తి చేశారు. వెంటనే ట్రయల్ రన్ వేసి లైట్లు వెలిగించారు. మంచి ముహూర్తం చూసి ప్రారంభించాల్సి ఉంది.

ప్రారంభించకపోవడంతో వెలగని లైట్లు...

సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి వచ్చినా ప్రారంభోత్సవం చేయకపోవడంతో లైట్లను వెలిగించడం లేదు. దీంతో కేపీస్పీ రోడ్డు సుమారు కిలోమీటర్ మేర రాత్రివేళ చిమ్మ చీకట్లో మగ్గాల్సి వస్తోంది. సంవత్సరకాలంగా లైట్లు లేక బాటసారులు, ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. చీకట్లో ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. లైటింగ్ పనులు పూర్తై ప్రారంభోత్సవం కాక పోవడంతో సెంట్రల్ లైటింగ్ అలంకారప్రాయంగా ఉంటోంది. ఇప్పటికైనా కలెక్టర్ ప్రియాంక, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ నాగేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.



ప్రారంభోత్సవానికి నోచుకోని సెంట్రల్ లైటింగ్

రోడ్డు విస్తరణ చేసినా ఫలితం లేదు



రోడ్డు విస్తరణ పనులు ఏడాది క్రితం చేపట్టారు. పనులు మందకోడిగా సాగాయి. సెంట్రల్ లైటింగ్ ట్రయల్ రన్ వేసి నెల రోజులు గడుస్తున్నా ప్రారంభించ లేదు. రాత్రిపూట వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సీపీఐ కార్యదర్శి

లైటింగ్ లేక ఇబ్బందులు



సెంట్రల్ లైటింగ్ పనుల పేరుతో కేపీస్పీ రోడ్డు పక్కన ఉండే కరెంట్ పోల్స్ గత ఫిబ్రవరిలో తొలగించారు. అప్పటి నుంచి కిలోమీటర్ మేర అంధకారం అలముకుంది. లైట్లు లేక అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పనులు పూర్తయినా ప్రారంభించకపోవడం విడ్డూరం.

– రవీందర్ రెడ్డి, పాల్వంచ

కార్మికుల సమ్మెకు పరిష్కారం చూపండి



మానవహారం చేపట్టిన పంచాయతీ కార్మికులు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి నిరవధిక సమ్మెను విరమింపజేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం ఇల్లెందులోని గోవింద్‌సెంటర్‌లో కార్మికులు మానవహారం చేపట్టి ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 30 రోజులు దాటినా ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండివైఖరిని వీడి తక్షణమే కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు కార్మికులు ఐక్యంగా తమ ఉద్యమాన్ని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో జటంగి వెంకన్న, సామేలు, మోహన్‌రావు, నాగేశ్వరరావు, నర్సింహారావు, గోపి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచ: బీసీఎం రహదారిలో ప్రమాదకరంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని పాల్వంచ సీఐ వి.వినయ్‌కుమార్, నేషనల్ హైవే అథారిటీ అధికారి నళిని అన్నారు. ఎగుడుదిగుడుగా మారి ప్రమాదాలకు నిలయంగా మారిన దుస్థితిపై ఆగస్టు 24న సాక్షిలో ప్రచురితమైన 'హడలెత్తిస్తున్న హైవే' కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం ఆయా ప్రాంతాలను సందర్శించి డేంజర్ స్పాట్లను గుర్తించారు. మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్ఐ బాణాల రాము, టీపీఓ సత్యనారాయణ, మున్సిపల్ ఏఈ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో బీమా నమోదుకు గడువు ముగింపు

సుజాతనగర్: 2023 జూన్ 18 నాటికి వ్యవసాయ భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా నమోదు చేసుకునేందుకు శనివారంతో గడువు ముగుస్తుందని ఏఓ జి.నర్మద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు వివరాలతో ఏఈఓని సంప్రదించాలని కోరారు.

మైనార్టీలపై దాడులకు సమాధానం చెప్పాలి

సింగరేణి(కొత్తగూడెం): మైనార్టీ వర్గాలపై జరుగుతున్న దాడులపై ప్రధాని మోదీ నోరు విప్పాలని, లేదంటే భవిష్యత్‌లో దేశంలో మైనార్టీలకు రక్షణ లేకుండా పోతుందని రుద్రంపూర్ మసీద్ ఏ ఖుబా మౌలానా రహీమతుల్లా అన్నారు. చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌లోని మసీదులో శుక్రవారం ఆయన మాట్లాడారు. జైపూర్, ముంబైలో జరిగిన దాడులే ఇందుకు నిదర్శనమన్నారు. మణిపూర్ ఘటన మరువక ముందే హర్యానాలో మసీదులో ఉండే మౌలానా చంపారని ఆరోపించారు. కార్యక్రమంలో మహ్మద్ గౌస్, సునుబాయి, శమీమ్, ఫహీమ్, మున్వర్, అజర్, నైమొద్దీన్, అజ్జు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బీఎల్‌ఓలు

టేకులపల్లి: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఈవీఎంలపై ఈనెల 2న ప్రారంభమైన అవగాహన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ మేరకు శుక్రవారం పాతలచ్చగూడెం, సంపత్‌నగర్, గంగారం, చింతోనిచెలక పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జయకృష్ణ, బీఎల్‌ఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన



చుంచుపల్లి: నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కంచర్ల చంద్రశేఖర్‌రావు, బాదావత్ శాంతి

చుంచుపల్లి: ప్రశాంత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ బాదావత్ శాంతి శుక్రవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. మాట్లాడుతూ.. రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు చెప్పారు. సర్పంచ్ పద్మ,ఎంపీఓ సత్యనారాయణ, ఉప సర్పంచ్, సభ్యులు పాల్గొన్నారు

ఇల్లెందురూరల్: మండలంలోని మస్సివాగు గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణ పనులకు సర్పంచ్ భూక్యా నందు, ఎంపీటీసీ బోడ సుమలత శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసిందని, ఈ నిధులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రజలకు, పరిపాలనకు సౌకర్యవంతంగా ఉండేలా భవన నిర్మాణం చేపడుతామని చెప్పారు. ఉపసర్పంచ్ రాంబాబు, సొసైటీ డైరెక్టర్ కిన్నెర నర్సయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు...

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ 1వ వార్డులో జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. బస్తీలో సీసీ రోడ్డు అవసరాన్ని గుర్తించి స్థానికుల విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. పనులు నాణ్యతతో చేపట్టేలా ప్రజలు దగ్గరుండి చూసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ పాయం కృష్ణప్రసాద్, బోళ్ల సూర్యం, సాంబమూర్తి, పెద్దిని హరినాథబాబు, నాగార్జున్, బల్లెం సోల్‌మన్, అఫ్రిద్, కుడితి శ్రీను, రాజేశ్వరరావు, వెంకన్న, దశరథ్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల ముందస్తు అరెస్ట్




జూలూరుపాడు: పోలీస్ స్టేషన్‌లో ఏఎన్‌ఎంలు

జూలూరుపాడు: కాంట్రాక్ట్ సెకండ్ ఏఎన్‌ఎంలను షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో పోలీసులు ముందస్తుగా సెకండ్ ఏఎన్‌ఎంలను అరెస్టు చేసి అడ్డుకున్నారు. జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా శుక్రవారం తెల్లవారుజామునే ఎస్ఐ బి.పురుషోత్తం ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో బానోత్ పార్వతి, ముక్తి సావిత్రి, బానోత్ రీనా, అజ్మీర రాణి, ఇరప అనూష, తోలెం సుశీల, బొమ్మల పరమేశ్వరి ఉన్నారు.

సుజాతనగర్: ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్ బయలుదేరేందుకు సిద్ధమవుతున్న 2వ ఏఎన్‌ఎంలను స్థానిక పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కరోనా కష్టకాలంలో సైతం తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించామని, పాలకులకు తమపై కనికరం లేదని ఆరోపించారు. జీఓ నంబరు 16 ప్రకారం తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో రాధ, జి.పద్మజ, వీరమ్మ, సునీత ఉన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ బాలరాజు

ఇల్లెందురూరల్: 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల ప్రచార పోస్టర్లను ఎంపీడీఓ బాలరాజు, జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు శుక్రవారం ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, కేటాయించిన పాఠశాలల్లో అర్హులైన విద్యార్థులు అడ్మిషన్ పొందాలని సూచించారు. క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లే అవకాశం లేని వారు ఓపెన్ టెన్త్, ఇంటర్ ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ నిర్వాహకులు డి.రాంచందర్, రాజేందర్ (కాకతీయ స్కూల్), వెంకటస్వామి (జవహర్ స్కూల్), మోహన్‌రావు (భారత్ స్కూల్), అధ్యాపకులు రాము, ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ సాధారణ సమావేశం



హాజరైన కౌన్సిలర్లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. అజెండాలోని ఆరు అంశాల మీద చర్చించి ఆమోదించారు. స్వచ్ఛ ఆటోలు పాత టెండర్ రద్దు చేసి నూతన టెండర్ ఆహ్వానించాలని తీర్మానించారు. వాటర్ సోర్స్‌లలో వాటర్ ఎనాలసిస్ చేసేందుకు నాచురల్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కోఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ ఖమ్మం వారికి ఆమోదం తెలిపారు. హరితహారంలో పని చేసే కార్మికులకు రూ.1500 వేతనం చెల్లించాలని తీర్మానించారు. వీధిలైట్లు వెలగని చోట తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు, కమిషనరర్ కుమారస్వామి, డీఈ నవీన్, టీపీఎస్ అవినాష్, ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు ఒకే కేంద్రంలో నిర్వహించాలి

సుజాతనగర్: గురుకుల ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ఒక అభ్యర్థికి ఒకే కేంద్రంలో నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లిక్కి బాలరాజు అన్నారు. శుక్రవారం సుజాతనగర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష గందరగోళంగా మానసిక ఒత్తిడికి లోనయ్యే విధంగా ఉందన్నారు. పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్వహించే టీజీటీ, పీజీటీ జేఎల్, డీఎల్ పరీక్ష కేంద్రాలు ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయని విమర్శించారు. ఒక పేపరు ఖమ్మం కేంద్రంలో ఉంటే మరో పేపర్ హైదరాబాదు వంటి సుదూర ప్రాంతాల్లో సెంటర్ కేటాయించడం వలన పరీక్షకు, పరీక్షకు మధ్య సమయం కూడా లేకపోవడంతో అభ్యర్థులు గందరగోళంతో పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో గ్రూప్–1 పరీక్ష నిర్వహణలో టీఎస్‌పీఎస్సీ ఏ విధంగా అబాసుపాలు అయిందో ఇప్పుడు నిర్వహించే గురుకుల టీచర్ పరీక్ష నిర్వహణలో కూడా ప్రభుత్వం అలాగే అబాసు పాలవుతుందన్నారు. ఒక ప్రణాళికా బద్ధంగా పరీక్షకు పరీక్షకు మధ్య కొంత సమయం ఇవ్వాలని, అలాగే ఒక అభ్యర్థికి ఒక కేంద్రంలోనే అన్ని పరీక్షలు రాసే విధంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లమల చందర్‌రావు, వెంకటేష్ వేణు, శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి



పాల్వంచ: అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బొల్లేరుగూడెంలో ర్యాలీ

సుజాతనగర్: తల్లిపాలను మించిన ఆహారం మరొకటి లేదని జిల్లా సంక్షేమాధికారిణి ఎం.సబిత అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా పాత అంజనాపురం రైతు వేదికలో తల్లిపాల ఆవశ్యకతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలలో వ్యాధి నిరోధకశక్తి ఉంటుంన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానిక తల్లిపాలు అత్యంత ఉపయోగకరంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తల్లిపాలు వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక సీమంతం నిర్వహించారు. సీడీపీఓ లెనీనా, సెక్టార్ సూపర్‌వైజర్ పయ్యావుల రమాదేవి, ఏఎన్‌ఎం శిరీష, కార్యదర్శి సుమలత పాల్గొన్నారు.

పాల్వంచ: గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని హెచ్‌డబ్ల్యూసీ డాక్టర్ ప్రతాప్ అన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వెంగళరావు కాలనీ సెక్టార్ బొల్లేరుగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని, ముర్రుపాలు ఎంతో శ్రేష్టమైనవని, ఇమ్యూనిటీ పెంచుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సీతాదేవి, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు కె.రమాదేవి, వెంకటరమణ, రజియా, దుర్గ, సులోచన, కళావతి, ఆయాలు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

జూలూరుపాడు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నాయకురాలు బానోత్ విజయబాయి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని కొమ్ముగూడెంలో శుక్రవారం పర్యటించిన ఆమె గ్రామస్తుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. గ్రామపంచాయతీ కార్మికులకు సమ్మెకు సంఘీభావం తెలిపి వారితో కలిసి భోజనం చేశారు. జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూదన్‌రావు, ధరావత్ రాంబాబు, పోతురాజు నాగరాజు, బానోత్ కిషన్, తాళ్లూరి లక్ష్మయ్య, ఆంగోతు శ్రీను, కోటా కరుణాకర్, భూక్యా వీర్యా, నరేష్, టి.లక్ష్మి, బి.నాగు, నగేష్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



పుస్తకాలు అందజేస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5షాఫ్ట్ కార్మికులు సెక్యూరిటీ ఫండ్ ద్వారా సేకరించి డబ్బుతో ఏరియా పరిధిలోని సుమారు 5 పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను కొనుగోలు చేసి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గని ఏజెంట్ రవీందర్, గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, కూసన వీరభద్రయ్య, చిలక రాజయ్య, హుమాయిన్, విజయగిరి శ్రీనివాస్, బుసి, ఆసిఫ్, ఉపాధ్యాయులు గౌతమ్, వార్డ్ సభ్యులు శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతినిధుల ఎంపిక



కెప్టెన్లుగా ఎంపికైన విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్‌లో గల సెయింట్ జోసఫ్ పాఠశాలలో శుక్రవారం ఇన్‌వెస్ట్యూచర్ సెరిమనీ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శైన్ అలెక్స్ హాజరయ్యారు. ఈ విద్యాసంవత్సరం (2023–24) స్కూల్ ప్యూపిల్ లీడర్ (బాయ్స్ అండ్ గర్ల్స్), క్లబ్ జనరల్ సెక్రటరీస్, అసిస్టెంట్ సెక్రటరీలను ఎంపిక చేశారు. 4 నుంచి 10వ తరగతి వరకు గ్రూప్ కెప్టెన్లు, (గ్రీన్, రెడ్, బ్లూ, ఎల్లో)ల క్యాటగిరీల వారీగా ఎంపిక చేసి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాల సుమారు 60 సంవత్సరాల క్రితం ఏర్పాటైందని, ఇందులో చదువుకున్న పిల్లలు దేశ, విదేశాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారని, అంతేకా కాకుండా ఈ పాఠశాల నాటి నుంచి నేటి వరకు ఎంతో క్రమశిక్షణ నడుస్తుండడం వలన ఆదరణ లభిస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, జార్జిరెడ్డి, అభిలాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి



జూలూరుపాడు మండలం పడమటనర్సాపురం, భేతాళపాడు గ్రామాల మధ్యగల బీటీ రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డు కుంగి పగుళ్లు వచ్చి, గుంతలు ఏర్పడటంతో అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరై ఏడాదిన్నర అయినా పనులకు మోక్షం కలగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. - జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : జె.నాగేందర్, పీఆర్ ఏఈ, జూలూరుపాడు
సెల్ నంబర్: 9052565252